క్లుప్తంగా

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డే చిన్నారులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి దొంతిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున చిన్నారులను ఇళ్ల నుంచి బయటకు పంపించకూడదని గ్రామ కార్యదర్శి శంకర్, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, శ్యామల సూచించారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఓటరు స్లిప్పులు

తహసీల్దార్ తులసీరాం



ఓటరు స్లిప్పు అందజేస్తున్న తహసీల్దార్

వెల్దుర్తి(తూప్రాన్): లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ప్రతి ఇంటికీ ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్ అందజేయాలని తహసీల్దార్ తులసీరాం ఆదేశించారు. మండలంలోని యశ్వంతరావ్‌పేట, మంగళపర్తి, మానెపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. నిర్దేశించిన గడువులోగా బీఎల్‌ఓలు పంపిణీ ప్రక్రియ పూర్తిచేయాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

కుక్కలు, కోతుల బెడద

బెంబేలెత్తుతున్న గ్రామస్తులు




కుక్క దాడిలో గాయపడిన హన్మంతు

నర్సాపూర్: నర్సాపూర్‌లో కుక్కలు, కోతుల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ప్రతిరోజు ఏదో ఒకచోట కోతులు, కుక్కలు ప్రజలను కరువడంతో అస్వస్థతకు గురవుతున్నారు. హనుమాన్ గల్లీ ఏరియాకు చెందిన కుమ్మరి హన్మంతును గురువారం ఓ కుక్క కరువడంతో గాయాల పాలయ్యాడు. 15రోజుల క్రితం ఆయన భార్య లక్ష్మిపై కోతి దాడిచేసి గాయపర్చింది. చిన్న పిల్లలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయ పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కోతులు, కుక్కల బెడద నుంచి కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠశాల పరిశీలన

చేగుంట(తూప్రాన్): మండలంలోని పొలంపల్లి ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో మౌలిక వసతుల కల్పన కోసం అధికారులు సమావేశం నిర్వహించారు. గురువారం పాఠశాల కమిటీ సభ్యులతో తహసీల్దార్ గియాసున్నీసా, ఎంపీడీఓ చిన్నారెడ్డి పాఠశాలకు కావలసిన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. చేపట్టాల్సిన అభివృద్ధి గురించి తీర్మానం చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షురాలు పులిమామిడి లక్ష్మి, సభ్యులు యాదమ్మ, రేణుక, అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శి సురేశ్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో హోం పోలింగ్



హోం ఓటింగ్ నిర్వహిస్తున్న అధికారులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం హోం పోలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 13 గ్రామాల్లో గుర్తించిన 26మంది దివ్యాంగులు, వృద్ధులకు అధికారులు హోం పోలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గియాసున్నీసా, ఆర్ఐ నర్సింగ్ యాదవ్, అల్లం అంజనేయులు, బీఎల్‌ఓలు, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

శివ్వంపేట(నర్సాపూర్): వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దొంతిలో గురువారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉప్పుగాల సురేశ్(32) తన ఇంటి వద్దే ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. తీవ్రగాయాలతో మృతిచెందాడు. సురేశ్ ఓ హత్య కేసులో జైలుపాలై ఆరు నెలల క్రితం బయటకు వచ్చాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

ఫలితం శూన్యం

- కన్నెత్తి చూడని ప్రత్యేక అధికారులు
- పరిష్కారంకాని సమస్యలు
- మూడు నెలలుగా అందని బిల్లులు
- అప్పులుచేసి నడిపిస్తున్న కార్యదర్శులు

సర్పంచ్‌ల పదవీకాలం గడువు ముగియడంతో పంచాయతీల పాలన కోసం ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. కానీ గ్రామాల్లో పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. పరిపాలన పూర్తిగా అస్తవ్యస్థమైంది. ఎలాంటి పనులు చేయాలన్నా ప్రత్యేక అధికారుల అనుమతి తప్పనిసరి. కానీ వారు ఫోన్‌లోనే సంప్రదించి "మీరే చేయించండి" అంటూ సెక్రటరీలపైనే పూర్తి భారం వేస్తున్నారు. నిధులు లేకపోవడంతో కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు.



మురుగు కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు

హవేళిఘణాపూర్(మెదక్): గ్రామాల్లో సమస్యలు ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్నట్టు ఉంటున్నాయి. మెదక్ మండల పరిధిలోని మాచవరం గ్రామంలో కుర్మవాడలో సింగిల్‌ఫేజ్ మోటర్ కాలిపోయి ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ ప్రత్యేక అధికారి, కార్యదర్శుల దృష్టికి తీసుకెళ్లగా 15రోజుల తర్వాత బిగించారు. భగీరథ నీరు సరిపడా రాకపోవడంతో వేసవిలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో ఏదైనా సమస్య ఉందని ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకెళ్తే "మీరే చేయండి మేమేం చేస్తాం" అంటూ కార్యదర్శులను బెదిరిస్తున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయని కార్యదర్శులు వాపోతున్నారు.

పంచాయతీలకు వెళ్లని అధికారులు

ఉమ్మడి హవేళిఘణాపూర్, మెదక్ మండలాల్లోని గ్రామాలకు సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికారులను నియమించారు. అయితే గ్రామస్తుల సమస్యలను పంచాయతీ కార్యదర్శుల దృష్టికి తీసుకెళ్తే తమకేమీ సంబంధం లేదనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా అధికారులు గ్రామాల్లో వారానికి రెండు రోజులు కేటాయించాలని చెప్పినా వారు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఏవైనా సంతకాలు అవసరం ఉంటే ప్రత్యేక అధికారులు ఉన్న చోటుకు వెళ్లి సంతకాలు తీసుకుంటున్నారు. తీరా ప్రతీ సమస్యను "మీరు పరిష్కరించకుండా మాకేందుకు చెబుతున్నారు" అంటూ కార్యదర్శులపై విరుచుకు పడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

పంచాయతీల్లో నిధుల్లేక..

పంచాయతీ నిర్వహణ అవసరమైన వీధి దీపాలు సింగిల్‌ఫేజ్ మోటార్లు కాలిపోతే మరమ్మతులు చేయించడం, కార్మికులకు వేతనాలు లాంటి వాటికి మూడు నెలలుగా నిధుల్లేక పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు తమ వేతనాలను పంచాయతీ నిర్వాహణకే వెచ్చించగా మరికొందరు వడ్డీకి అప్పులు తెచ్చి పనులు చేయిస్తున్నారు. ప్రత్యేక అధికారులు తమకు ఎలాంటి సహకారం అందించడం లేదని, వారు తమకేమీ పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని కొందరు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.



నిరుపయోగంగా ఉన్న సింగిల్‌ఫేజ్ మోటార్

> **చర్యలు తీసుకుంటాం**
>
> 
>
> వారంలో రెండు రోజులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. అధికారులు తప్పని సరిగా గ్రామాలను సందర్శించి సమస్యలపై దృష్టి కేంద్రీకరించాలి. ఎవరు అలా వ్యవహరించకపోయినా చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.
>
> – రఘు, మెదక్ ఎంపీడీవో

కోనాపూర్ సహకార సంఘంలో అవినీతి

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- కాంగ్రెస్ నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రామాయంపేట(మెదక్): మండలంలోని కోనాపూర్ సహకార సంఘంలో అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని డబ్బులు రికవరీ చేయాలని పీసీసీ అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్, పార్టీ జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు నాగులు, ఓబీసీ సెల్ జిల్లా కన్వీనర్ విప్లవ్‌కుమార్ డిమాండ్ చేశారు. వారు గురువారం రామాయంపేటలో మాట్లాడుతూ గతంలో ఆదర్శ సహకార సంఘంగా ఉన్న ఈ సొసైటీని అవినీతి సొసైటీగా మార్చారని ఆరోపించారు. రూ.2.26 కోట్లమేర అవినీతి జరిగిందని అధికారుల విచారణలో తేలినా డబ్బును రికవరీ చేయడంలో అప్పటి ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. సభ్యులుగా ఉన్న 694మంది రైతులు తీవ్రంగా నష్టపోయారని వాపోయారు. వెంటనే డబ్బును రికవరీ చేసి రైతులకు పంచాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు జహీరుద్దీర్, కోనాపూర్ సహకార సంఘం డైరెక్టర్ సిద్ధరాములు, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉత్త మాటలు.. ఉద్దెర హామీల కాంగ్రెస్



పాపన్నపేట(మెదక్): ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే పద్మ
- ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న నేతలు

పాపన్నపేట(మెదక్): ఉత్త మాటలు.. ఉద్దెర హామీలు ఇచ్చే కాంగ్రెస్ పార్టీని నమ్మి తెలంగాణను ఆగం చేయొద్దని మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం ఆమె పాపన్నపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సాలం చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. కాంగ్రెస్ 420 హామీలు, ఆరు గ్యారంటీలు ఇస్తామని, ఉత్తర ప్రగల్బాలు పలికి, ప్రజలను మభ్యపెట్ట చూస్తున్నారని వాపోయారు. కాంగ్రెస్ పార్టీ వచ్చినప్పటి నుంచి విద్యుత్ కష్టాలు ఎక్కువయ్యాయని, మరోపక్క బీజేపీ మత రాజకీయాలను ప్రోత్సహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని కోరారు. ఆమె వెంట మండలశాఖ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ గురుమూర్తిగౌడ్, నవీన్, వెంకటేశం, శ్రీనివాస్, సాయిరెడ్డి తదితరులు ఉన్నారు.

వెంకట్రామిరెడ్డిని గెలిపించాలి..

చిన్నశంకరంపేట(మెదక్): బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి ఓట్లువేసి గెలిపించాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మదేవేందర్‌రెడ్డి కోరారు. మండలంలోని టి.మాందాపూర్, వెంకట్రావుపల్లి, శాలిపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాసేవకు ముందుకు వచ్చిన మాజీ కలెక్టర్, వంద కోట్లతో స్వచ్ఛంద సంస్థ ఏర్పాటుచేసి సేవ చేయనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ మాధవిరాజు, మండల అధ్యక్షుడు పట్లోరి రాజు తదితరులు ఉన్నారు.

మున్సిపాలిటీలో..

రామాయంపేట(మెదక్): రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో గురువారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. పార్టీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి కుమారుడు భరద్వాజ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సరాపు యాదగిరి, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు నాగరాజు, సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం తదితరులు పట్టణంలో పర్యటించి పార్టీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, ఇతర నాయకులు మండలంలోని రాయిలాపూర్‌లో సమావేశం నిర్వహించారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, ఆ పార్టీ నాయకులు గోవర్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పలు వార్డులలో ఇంటింటికీ తిరిగి బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్, బీజేపీలను నమ్మే స్థితిలో లేరన్నారు.

మొక్కల రక్షణకు చర్యలు

- ఎంపీడీవో దామోదర్



నర్సరీ పరిశీలిస్తున్న ఎంపీడీవో దామోదర్

సాక్షి ఎఫెక్ట్..

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కొర్విపల్లి నర్సరీలో ఎండిపోయిన మొక్కలను రక్షించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎంపీడీవో దామోదర్ తెలిపారు. గురువారం ఆయన కొర్విపల్లి హరిత నర్సరీని పరిశీలించారు. సాక్షి పత్రికలో ప్రచురితమైన 'తప్పును కప్పి పుచ్చేందుకు..' అనే కథనానికి స్పందించిన ఆయన బాధ్యులైన గ్రామ అధికారులకు మెమోలు జారీచేశారు. ఎండిపోయిన వాటిని తొలగించి, 2,550 మొక్కలను నర్సరీకి తరలించి కాపాడనున్నట్లు తెలిపారు. నర్సరీలోని ఎండిన మొక్కలను లెక్కించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని చెప్పారు.

బీసీ సంక్షేమశాఖ అధికారిగా నాగరాజుగౌడ్



నాగరాజును సన్మానిస్తున్న సిబ్బంది

మెదక్ కలెక్టరేట్: జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమశాఖ అధికారిగా మెదక్ వాసి మంగ నాగరాజుగౌడ్ నియామకం అయ్యారు. కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్‌ను గురువారం ఆయన మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనను శాలువాతో సత్కరించారు.

బీజేపీని వ్యతిరేకిద్దాం

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సంజీవ

కొల్చారం(నర్సాపూర్): మరోసారి కేంద్రంలో పూర్తి మెజార్టీవస్తే రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్న బీజేపీని ఈ ఎన్నికల్లో ఓటుఅనే ఆయుధంతో వ్యతిరేకించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించని సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ భారత రాజ్యాంగం స్థానంలో మనువాదాన్ని తీసుకురావాలని ప్రయత్నిస్తోందని, అది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హక్కులను కాలరాయడమేనన్నారు. కార్యక్రమంలో పెంటయ్య, ఆనంద్, యాదగిరి, నరేశ్, కేశవులు, లక్ష్మణ్, రవి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులు కొనసాగిస్తే చర్యలు

సీఐ కేశవులు

హవేళిఘణాపూర్(మెదక్): గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మెదక్ రూరల్ సీఐ కేశవులు హెచ్చరించారు. మండల పరిధిలోని రాయిన్‌పల్లిలోని చిన్నబోయిన కిష్టయ్య కిరాణా దుకాణంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో బెల్టుషాపులు కొనసాగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

◆ నేటి నుంచి మల్లికార్జునస్వామి వార్షికోత్సవాలు



కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోగల భ్రమరాంబ మల్లికార్జున స్వామి సహిత శనేశ్వరస్వామి ఆలయ 30వ వార్షిక బ్రహ్మోత్సవాలను 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అర్చకులు మురళీధర్ శర్మ, రవిప్రసాద్‌శర్మ, ఉమాశంకరశర్మ తెలిపారు. ఉత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు అలాగే 5న కల్యాణం, అన్నదాన వితరణ ఉంటుందని చెప్పారు.

◆ నేడు హరీశ్‌రావు రోడ్‌షో

కౌడిపల్లి(నర్సాపూర్): బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపు కోసం శుక్రవారం కౌడిపల్లిలో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే సునీతారెడ్డి నిర్వహించే రోడ్‌షోలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సార రామాగౌడ్ పిలుపునిచ్చారు.

◆ వడదెబ్బతో ఉపాధికూలీకి అస్వస్థత

కౌడిపల్లి(నర్సాపూర్): వడదెబ్బ తగలడంతో ఉపాధి కూలీ అస్వస్థతకు గురైంది. దీంతో వెంటనే బాధితురాలిని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మండలంలోని వెంకటాపూర్(ఆర్) సమీపంలోని సాకలి కుంటలో ఉపాధిహామీ కూలీలు పూడికతీత పనులు చేస్తుండగా గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల లక్ష్మి పనిచేస్తూ వడదెబ్బ తగిలి కింద పడిపోయింది. ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

◆ కాంగ్రెస్ నేతల ప్రచారం

పెద్దశంకరంపేట(మెదక్): జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న సురేశ్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ అధ్యక్షుడు మండల రాయిని మధు ఆధ్వర్యంలో గురువారం బూర్గుపల్లి, జూకల్, వీరోజిపల్లి తదితర గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. చేతి గుర్తుకే ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో జనార్దన్, నారాగౌడ్, సత్యనారాయణ, సంగమేశ్వర్, పెరుమాండ్లగౌడ్, దేవేందర్, భానుగౌడ్, గోవింద్‌రావు, సాయిరెడ్డి, నర్సింహులు తదితరులున్నారు.

◆ పశువులపై కుక్కల దాడి

తూప్రాన్: మున్సిపల్ 10వ వార్డు వెంకటాపూర్(పీటీ)లో పశువులపై కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. గ్రామానికి చెందిన రైతు మన్నే శంకర్‌కు చెందిన దూడలపై కుక్కలు గుంపులుగా దాడిచేశాయి. వీధి కుక్కల బెడద వల్ల నిత్యం చిన్న పిల్లలు, వృద్ధులు గాయాల బారిన పడుతున్నారని గ్రామస్తులు వాపోయారు.

రెండు రోజులే పోస్టల్ సేవలు



మడూర్ పోస్టాఫీస్ వద్ద కిక్కిరిసిన ఖాతాదారులు

- పోస్టు మాస్టర్‌లేక కష్టాలు
- ఇబ్బందుల్లో 8 గ్రామాల ప్రజలు

చిన్నశంకరంపేట(మెదక్): నిత్యం సేవలు అందించడంతోపాటు డిజిటల్ విభాగంలో దూసుకుపోతున్న పోస్టల్‌శాఖ చిన్నశంకరంపేట మండలంలోని మడూర్ గ్రామంలో మాత్రం వారంలో రెండు రోజులు మాత్రమే సేవలు అందిస్తుండడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. మడూర్ పోస్టాఫీస్‌లో రెగ్యులర్ పోస్టుమాస్టర్ లేకపోవడంతో మిర్జాపల్లి పోస్ట్‌మాస్టర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన వారంలో రెండు రోజులు మాత్రమే మడూర్‌లో అందుబాటులో ఉంటున్నారు. మడూర్, సంగాయిపల్లి, వెంకట్రావుపల్లి, చెన్నాయిపల్లి, రామాయపల్లి, శాలిపేట, గజగట్లపల్లి గ్రామాల ప్రజలు పోస్టల్ ఖాతాలు కలిగి ఉన్నారు. ఉపాధిహామీ పథకం కూలి డబ్బులతోపాటు నెలనెలా ఆసరా పెన్షన్ డబ్బులు ఆ ఖాతాల్లోనే జమ అవుతున్నాయి. ఆ డబ్బులు డ్రా చేసుకునేందుకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేవలం రెండు రోజుల్లో ఎనిమిది గ్రామాల ప్రజలు డబ్బులు డ్రా చేసేందుకు వస్తుండడంతో ఖాతాదారులతో పోస్టాఫీస్ ఆవరణ కిక్కిరిసి పోతోంది. దీంతో డబ్బులు డ్రా చేయడం ఇబ్బందిగా మారి తోపులాట చోటుచేసుకుంటుందని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ పోస్టుమాస్టర్‌ను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పత్తాలేని సిబ్బంది

- కొనుగోలు కేంద్రాల వద్ద నిర్లక్ష్యం
- తూకం వేసేది కూలీలే..
- పర్యవేక్షణ కరువు: రైతులు



ధాన్యం తూకం వేస్తున్న కూలీలు

అల్లాదుర్గం(మెదక్): ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు, సిబ్బంది పత్తాలేకుండా పోతున్నారు. రైతుల ధాన్యాన్ని తూకం వేయడంతో పాటు, బస్తాలను రికార్డుల్లో ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉంటుంది. కొనుగోలు కేంద్రం వద్ద సిబ్బంది బిహార్ కూలీలకు అప్పగించి వెళ్లిపోయారు. ఈ ఘటన అల్లాదుర్గం గడిపెద్దాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. రైతు తెచ్చిన ధాన్యాన్ని బిహార్ కూలీలు తూకంవేస్తూ బస్తాలల్లో నింపి పెడుతున్నారు. ధాన్యం బస్తాలు, తూకం వివరాలు రికార్డులలో రాయాల్సిన సిబ్బంది మాత్రం అక్కడ కనిపించడం లేదు. ఇష్టం వచ్చినప్పుడు వచ్చి బస్తాలను లెక్కపెట్టి రాసుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. ఏవైనా అవకతవకలు జరిగినా, ధాన్యం బస్తాల లెక్కలు తప్పినా ఎవరు బాధ్యత వహిస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలను అధికారులు కూడా పర్యవేక్షించడం లేదనే విమర్శలున్నాయి. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇనుప సామగ్రి చోరీ కేసులో నిందితుల అరెస్ట్



ఇనుప సామగ్రిని తరలించిన ఆటో

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామశివారులోని మూతబడిన బీఎస్ కంపెనీలో గత నెల 7న అపహరణకు గురైన సుమారు 200కిలోల ఇనుప సామగ్రిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తన సిబ్బందితో గురువారం ఉదయం దండుపల్లి చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా చోరీ చేసిన సామగ్రిని ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నారు. ఘటనలో చోరీకి పాల్పడిన నిందితులు కుంట రాజు, కుంట స్వామి, గరికపాటి శరత్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. అదే విధంగా చోరీ సొత్తును తరలించేందుకు ఉపయోగించిన ఆటోను సీజ్ చేసినట్లు చెప్పారు.

హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లోకి..



హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కులసంఘాల నాయకులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన పలు కులసంఘాల నాయకులు మాజీ మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ మేరకు చల్మెడ గ్రామానికి చెందిన ముదిరాజ్, కుర్మ సంఘాలలోని కాంగ్రెస్, బీజేపీకి చెందిన పలువురు నాయకులు మాజీ మంత్రి హరీశ్‌రావును హైదరాబాదులోని తన స్వగృహంలో గురువారం కలిశారు. ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెదక్ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతి రెడ్డి, ఎంపీటీసీ నంద్యాల బాల్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఆకుల మహేందర్, సొసైటీ చైర్మన్ కొండల్ రెడ్డి, బాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ పేరిట ఆన్‌లైన్ మోసం

రూ.25వేలు స్వాహా

కౌడిపల్లి(నర్సాపూర్): ఆన్‌లైన్‌లో జాబ్ ఇస్తామని ఆశచూపి రూ.25వేలు స్వాహా చేసిన ఘటన కౌడిపల్లి మండలం నాగ్సాన్‌పల్లిలో చోటుచేసుకుంది. గురువారం స్థానిక ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి, ఏఎస్ఐ విఠల్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన వద్ది కిరణ్‌కుమార్ వాట్సాప్‌కు ఆన్‌లైన్ జాబ్స్ ఇస్తామని మెసెజ్ వచ్చింది. దీంతో ఫోన్‌లో సంప్రదించగా తాము ఇచ్చేటాస్కులు పూర్తిచేస్తే డబ్బులు వస్తాయని, దీని కోసం కొంత డబ్బు జమచేయాలని సైబర్ మోసగాడు చెప్పాడు. దీంతో కిరణ్‌కుమార్ మొదట రూ.500 ఫోన్‌పే చేశాడు. అనంతరం మరోసారి రూ.1,400; తరువాత రూ.18వేలు; రూ.5,200 ఇలా మొత్తం రూ.25,100 వివిధ నంబర్లకు ఫోన్‌పే చేశాడు. తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వాలంటూ పట్టుపట్టడంతో మోసగాడు స్పందించలేదు. దీంతో మోసపోయానని గ్రహించి కిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రఘునందన్‌రావుకు మద్దతుగా ప్రచారం

కొల్చారం(నర్సాపూర్): మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా మండలంలోని తుక్కాపూర్, కొంగోడ్, రంగంపేట గ్రామాల్లో ఆ పార్టీకి చెందిన నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు దయాకర్ గౌడ్, పార్టీ కార్యకర్తలతో కలిసి పార్టీ మేనిఫెస్టోను వివరిస్తూ తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. అనంతరం మండల స్థాయిలో 10జీపీఏ సాధించిన రంగంపేట పాఠశాలకు చెందిన విద్యార్థిని నందినిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు ఏగొండ, గిరి, పోచందర్, గంగరాజు, సత్యనారాయణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్)లో..

మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీగా రఘునందన్‌రావ్‌ను గెలిపించాలని, నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానమంత్రిగా చూడాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. నరేందర్‌చారి, మనోహరాబాద్‌లో జిల్లా యువమోర్చ ఉపాధ్యక్షుడు అజయ్, నరేశ్‌గౌడ్ ప్రచారం నిర్వహించారు.

పెద్దశంకరంపేట(మెదక్)లో..

బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో బుజ్రాన్‌పల్లి, కమలాపూర్, ఆరేపల్లి, గొట్టిముక్కల, టెంకటి, కట్టెలవెంకటాపూర్, మాడ్చెట్‌పల్లి తదితర గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. శ్రావణ్, శ్రీహరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్)లో..

బీజేపీ నాయకులు మండలంలోని ఆరెగూడెంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనుల వద్దకు వెళ్లి నాయకులు ప్రచారం నిర్వహించారు. హరిబాబు, బాలకిషన్, శ్రీకాంత్, సురేశ్ పాల్గొన్నారు.